రగులుతున్న లీడర్..క్యాడర్

సొంత పార్టీపైనే కార్యకర్తల గుస్సా! • ప్రభుత్వం, పార్టీ పెద్దల తీరుపై గరంగరం • అధికారంలో ఉన్నా ఫలితం లేదని నైరాశ్యం

చిన్నాచితకా పనులు కావాలన్నా కష్టమే!

కేసీఆర్ హయాం లోనే అందిన రైతుబంధు

- ఇప్పుడు ఏవీ దిక్కులేవని మండిపాటు
- కాంట్రాక్టులు, కమీషన్లు ఐదారుగురికేనట
- మా బతుకులు ఏంగావాలెనని ఆగ్రహం
- పనులు అడుగుతమని మంత్రులు కలుస్తలేరు
- తమవద్దా లంచాలు అడుగుతున్నరని ఫైర్
- బీఆర్ఎస్ సర్కార్‌లో పనులన్నీ జరిగినయ్
- ఇప్పుడు వ్యవస్థ కుప్పకూలిందని నిర్వేదం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌లో క్యాడర్ రగిలిపోతున్నది. పార్టీ పెద్దల పనులు క్షణాల్లోనే జరిగిపోతుంటే తమ పనులేమో పాతరబడిపోతున్నాయని ఎమ్మెల్యేల నుంచి చోటామోటా లీడర్లలో ఆవేదన నిండిపోయింది. అటు ఏ పనులూ కాక.. ఇటు ఎలాంటి సంపాదన లేక పార్టీ, ప్రభుత్వ పెద్దలపై కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు కన్నెర్రజేస్తున్నారు. 'అధికారంలో ఉన్నా ప్రయోజనం లేదు. చిన్నచిన్న పనులు కూడా కావడం లేదు. పనుల కోసం పోతే మమ్ములను కూడా కమీషన్లు అడుగుతున్నరు. కేసీఆర్ సర్కారులోనే మంచిగుండె.. కనీసం అర్నెళ్లకోసారి రైతుబంధు పైసలైనా కచ్చితంగా వచ్చేవి. మా ప్రభుత్వంలో వాటికి కూడా దిక్కులేదు. ఈ జెండా ఎందుకు మోయాలి? వీళ్లకు బానిసత్వం చేయాలా?' అంటూ తమ ఆక్రోశం వెలిబుచ్చుతున్నారు.

'అధికార' సంతోషం ఆర్నెళ్లలో ఆవిరి

తమ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంతోషం ఆర్నెళ్లలోనే ఆవిరైపోయిందంటూ కాంగ్రెస్ కార్యకర్తలు వాపోతున్నారు. అధికారంలోకి వస్తే ఏదో జరిగిపోతుందని, ఆర్థికంగా స్థిరపడొచ్చని ఆశపడ్డామని, కానీ, ప్రభుత్వంలో ఏ ఒక్కపనీ కావడంలేదని నిట్టూర్చుతున్నారు. కనీసం గౌరవం కూడా దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని పార్టీని కాపాడుకున్నామని, అధికారంలోకి వచ్చాక లాభపడతామని భావించామని, కానీ పరిస్థితి పూర్తి విరుద్ధంగా ఉన్నదని చెప్తున్నారు.

ఇవీ ఉదాహరణలు

- సీఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే తమ కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్ల కోసం సీఎంని కలిసి జాబితా ఇచ్చారు. వెంటనే సీఎం రేవంత్ సీఎంవో అధికారిని పిలిచి పనిచేయాలని చెప్పారు. ఇదే విషయాన్ని సదరు ఎమ్మెల్యే తమ జిల్లాలో కీలక అధికారిని కలిసి వివరించి ఆయనకు కూడా జాబితా ఇచ్చారు. ఆ తర్వాత సదరు అధికారి సీఎంవో అధికారికి ఫోన్‌చేసి ఎమ్మెల్యే జాబితా గురించి చెప్పి 'చెయ్యిమంటరా?' అని అడిగారు. వెంటనే 'నీకు ఉద్యోగం కావాలా? లేక ఎమ్మెల్యే కావాలా?' అని సీఎంవో అధికారి నుంచి ప్రశ్న ఎదురైంది. దీంతో ఆ ఎమ్మెల్యే ఇచ్చిన జాబితాను చెత్త బుట్టలో పడేశారు.
- మరో ఎమ్మెల్యే గెలిచినప్పటి నుంచి కుటుంబం కోసం ఓ కొత్త కారు కొనాలని అనుకుంటున్నారు. ప్రభుత్వంలో ఉన్నాం కదా ఏదైనా పని వస్తే కారు కొనాలని ప్లాన్ చేసుకున్నాడు. కానీ ఇప్పటి వరకు ఆ ఎమ్మెల్యేకు ఒక్కటంటే ఒక్క పని కూడా కాలేదు. దీంతో తన కుటుంబం ఒత్తిడి భరించలేక అప్పు చేసి కారు కొన్నాడు.
- మరో ఎమ్మెల్యే ఎన్నికల ముందు ప్రచారం, ఖర్చుల కోసం రూ.1.5 కోట్ల అప్పు చేశాడు. గెలుస్తాం.. అధికారంలోకి వస్తాం.. పనులు చేసుకొని సంపాదించొచ్చు అనే ధీమాతో 1.5 కోట్లకు 3 కోట్ల రూపాయలు ఇస్తానని మాటిచ్చారు. అధికారంలోకి వచ్చారు కానీ పనులు కావడం లేదు. సంపాదన పెరగలేదు. 3 కోట్ల సంగతి దేవుడెరుగు.. అసలు కూడా ఇవ్వకుండా తప్పించుకొని తిరగాల్సిన పరిస్థితి వచ్చింది.

పని ఉంటే నో అపాయింట్‌మెంట్

మంత్రులు పార్టీ కార్యకర్తలను, లీడర్లను పూర్తిగా దూరం పెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఏవైనా చిన్నాచితకా పనుల కోసం అడిగితే అప్పుడు 'చూద్దాంలే' అంటూ చెప్తున్న మంత్రులు, ఆ తర్వాత వారిని పూర్తిగా దూరం పెడుతున్నారు. కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని కిందిస్థాయి లీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రుల పనులు, బిల్లులు చకచకా పాస్

ఓ మంత్రికి చెందిన వందల కోట్ల బిల్లులు చకాచకా రిలీజ్ అవుతున్నాయి. కోట్లకు కోట్ల బిల్లులు ఇప్పించినందుకు మరో కీలక నేతకు 8-10 శాతం కమీషన్ ముడుతున్నది. ఇలా పెద్దల పనులేమో క్షణాల్లో జరిగిపోతుంటే ఎమ్మెల్యేలు, చోటామోటా లీడర్ల పనులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. అటు పనులు కాక, ఇటు సంపాదన లేక క్యాడర్ మొత్తం పార్టీ, ప్రభుత్వ పెద్దలపై గుస్సా అవుతున్నది. ఓ కీలక మంత్రికి గత ప్రభుత్వంలో, ఇప్పుడు కూడా ఆయనకు కోట్లకు కోట్ల బిల్లులు మంజూరవుతున్నాయని చెప్తున్నారు. ఆయనతో పాటు ఆంధ్రా కాంట్రాక్టర్ల బిల్లులు ఆగమేఘాలపై విడుదలవుతున్నాయని, బిల్లులు చెల్లించినందుకు ఓ మంత్రి 8-10 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

కేసీఆరే నయం.. ఆ సర్వే వెయ్యి శాతం నిజం

తమ పార్టీ పాలనతో పోల్చితే కేసీఆర్ పాలనే బాగుందంటూ కాంగ్రెస్ కార్యకర్తలు బాహాటంగానే చెప్తున్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ రెడ్డి సామాజిక వర్గం లీడర్ మాట్లాడుతూ 'కేసీఆర్ సారే నయం ఉండె. కనీసం అప్పుడు సమయానికి రైతుబంధు పైసలైనా వచ్చేవి. ఇప్పుడు మాకు పనులు అయితలేవు.. రైతుబంధు పైసలు కూడా దిక్కులేవు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో 'ఫాంహౌస్ పాలన బాగుందా? ప్రజాపాలన బాగుందా' అంటూ సర్వే చేసింది. ఈ సర్వేలో 70 శాతానికి పైగా ఫాంహౌస్ పాలనే బాగున్నదంటూ నెటిజన్లు ఓట్లు వేశారు. దీనిపై స్పందించిన ఓ కాంగ్రెస్ నేత 'అవును.. ఆ సర్వే వెయ్యి శాతం వాస్తవం. కేసీఆర్ పాలనే బాగుంది. కేసీఆర్‌కు మద్దతుగా మా పార్టీ కార్యకర్తలు కూడా ఓటు వేశారు. కాంగ్రెస్ పాలనను వ్యతిరేకించారు' అని కుండబద్దలు కొట్టారు.

చిన్న పనైనా వాళ్లు.. వాళ్ల బంధువులకే

సాధారణంగా ఏ ప్రభుత్వంలో అయినా చిన్నచిన్న పనులను కింది స్థాయి లీడర్లకు, కేడర్‌కు అప్పగిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఓ స్థాయి పనులను కార్యకర్తలకు అప్పగించేవారు. కానీ కాంగ్రెస్ పాలనలో ఇందుకు పూర్తి విరుద్ధంగా ఎంత చిన్న పనైనా సీఎం, మంత్రులు, వాళ్ల బంధువులు, ముఖ్యనేతలే చేసుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

సొంత పార్టీలోనే కప్పం కట్టాలా?

పనుల కోసం మంత్రులు, ముఖ్యనేతల వద్దకు వెళ్లిన లీడర్లను సాధారణ వ్యక్తుల్లానే పరిగణిస్తున్నారు. అందరి మాదిరిగానే తమ వద్ద కూడా పనుల కోసం అధికారులు లంచాలు అడుగుతుంటే కీలక నేతలు కమీషన్లు అడుగుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొంత పార్టీలోనే ఉంటూ కప్పం కట్టాలా?, లంచాలు, కమీషన్లు ఇవ్వాలా? అని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు సీఎం, మంత్రులు, కీలక నేతలపై అభిమానంతో చాలా మంది పార్టీ కార్యకర్తలు, లీడర్లు వారితో దిగిన ఫొటోలను వాట్సాప్, ఫేస్‌బుక్ డీపీలుగా పెట్టుకున్నారు. కొన్ని రోజులుగా ఈ డీపీలను తొలగించుకుంటున్నారు.

అధికారంలో ఉన్నా తప్పని అప్పులు

కాంగ్రెస్ పదేండ్లు అధికారానికి దూరంగా ఉన్నా చాలా మంది పార్టీని అంటిపెట్టుకొనే ఉన్నారు. ఆస్తులను అమ్మి, అప్పులు చేసి పార్టీని నడిపించారు. అధికారంలోకి వచ్చాక మంచి రోజులు రాకపోతాయా? అనే నమ్మకంతో ఈ పని చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక మళ్లీ అవే అప్పులు చేస్తున్నట్టు వాపోతున్నారు. అప్పటికన్నా ఇప్పుడు ఇంకా ఎక్కువ అప్పు చేయాల్సి వస్తున్నదని ఓ రెండో స్థాయి నేత తన ఆవేదన వ్యక్తం చేశారు.

బానిసలమా? జెండా ఎందుకు మోయాలి?

పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రయోజనం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో లీడర్లు, కార్యకర్తలు మండిపోతున్నారు. పార్టీపై, ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఎందుకు వీళ్లను గెలిపించామా?' అంటూ మధన పడుతున్నారు. 'వాళ్ల లాభం కోసం మా జీవితాలను నాశనం చేసుకోవాలా?' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు పార్టీ జెండా మోసినందుకు కష్టాలే మిగిలాయని, ఇప్పుడు కూడా కష్టాలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 'ఇలాంటి వారి కోసం జెండా ఎందుకు మోయాలి? మేమేమైనా బానిసలమా?' అంటూ ప్రశ్నిస్తున్నారు.

అవును.. మేం కలిశాం!

- **ఫండ్స్‌పై మాట్లాడేందుకు కూర్చున్నాం**
- **మంత్రులకే ఎక్కువ ఫండ్స్ వెళ్తున్నయి**
- **సీఎం, రాష్ట్ర ఇన్‌చార్జీతో చర్చల తర్వాత అన్ని విషయాలు చెప్తాం**
- **రహస్య భేటీపై పెదవి విప్పిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**
- **అధిష్ఠానానికీ తాకిన కుంపటి సెగ!**
- **రంగంలోకి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి**
- **నేడో, రేపో అసంతృప్తులతో భేటీ?**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో తిరుగుబాటు కుంపటి మరింత రాజుకుంటున్నది. శుక్రవారం రహస్యంగా సాగిన ఈ వ్యవహారం ఆదివారం బహిరంగంగా మారిపోయింది. కొంతమంది ఎమ్మెల్యేలం సమావేశమైన మాట వాస్తవమేనని రహస్య భేటీలో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అంగీకరించారు. ఎమ్మెల్యే ఫండ్స్ విషయం మాట్లాడుకోవాలని భావించామని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో చర్చలు జరిపిన తరువాత అన్ని విషయాలు చెప్తామంటూ ఆయన వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నది. కాంగ్రెస్‌లో కుంపటి సెగ అటు అధిష్ఠానాన్ని కూడా తాకింది. పది మంది ఎమ్మెల్యేల రహస్య భేటీ వ్యవహారాన్ని తేలికగా తీసుకోవద్దని, యుద్ధప్రాతిపదికన జోక్యం చేసుకోవాలని హైకమాండ్ నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొన్నం, ఉత్తమ్, పొంగులేటి శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేల రహస్యభేటీపై సుదీర్ఘంగా చర్చించారనే విస్తృత ప్రచారం జరుగుతున్నది. ఒకవైపు మంత్రుల సమావేశం జరుగుతుండగానే, మరోవైపు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. పది మంది ఎమ్మెల్యేల రహస్య భేటీ ఏమీ కాదని, ఒక ఎమ్మెల్యే డిన్నర్ ఇచ్చారని, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారని చెప్పారు. అంతేకాకుండా, ఆ భేటీని 'టీ కప్పులో తుఫాన్'గా అభివర్ణించారు. ఒక పని గురించి వారు చర్చించుకున్నారని, అందులో పెద్దగా తప్పు పట్టాల్సింది లేదని చెప్పారు. కాగా, ఇప్పటికే సీఎంకు, ఒకరిద్దరు మంత్రులకు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు, ఆయా జిల్లాల ఎమ్మెల్యేలకు మధ్య పొసగడంలేదనే ప్రచారం జరుగుతున్నది. వీటికితోడు ఎమ్మెల్యేల రహస్యభేటీ కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనాలు సృష్టిస్తున్నది. రసహ్యా భేటీలో పాల్గొన్న ఎమ్మెల్యేలతో ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టవద్దని, ఏమైనా ఉంటే పార్టీ వేదికగా మాట్లాడుకుందామని చెప్పారు. మరో ఇద్దరు మంత్రులు కూడా రంగంలోకి దిగి సమావేశానికి వెళ్లిన వారితో మాట్లాడారు. పార్టీ ముఖ్యనేతలు మాట్లాడటంతో భేటీకి వెళ్లిన ఎమ్మెల్యేలు కూడా తాము సాధారణంగానే కలుస్తామని, ఇదేమీ పార్టీపై తిరుగుబాటు కాదని, ఎవరికీ వ్యతిరేకంగా తాము లేమని చెప్తున్నారు.

రంగంలోకి దీపాదాస్‌మున్షీ

ఎమ్మెల్యేల రహస్య భేటీపై కాంగ్రెస్ అధిష్ఠానం కూడా కొంత ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొన్నట్టు సమాచారం. ఈ అంశాన్ని తేలికగా తీసుకోవద్దని, యుద్ధప్రాతిపదికన జోక్యం చేసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు జోక్యం చేసుకున్నట్టు సమాచారం. దీంతోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ వద్దకు ఈ అంశం చేరినట్టు తెలిసింది. ఒకట్రెండు రోజుల్లో ఆమె కూడా హైదరాబాద్‌కు రానున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల భేటీలో కీలకంగా వ్యవహరించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదివారం ఒక మీడియా చానల్‌తో మాట్లాడుతూ.. తమ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతో సమావేశమవుతామని చెప్పడం గమనార్హం. ఎమ్మెల్యేల భేటీ పెద్ద విషయం కాదంటూనే, దీపాదాస్‌మున్షీ వద్ద సమస్యలు చెప్పుకుంటామని అనడంపై పార్టీలో చర్చ జరుగుతున్నది. రహస్యభేటీలో ఇప్పటివరకు తెరపైకిరాని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనకూ 'మెసేజ్' వచ్చిందని, కానీ దానిని తాను చూసుకోలేదని పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో 'అసలేం' జరుగుతున్నదనే చర్చ సాగుతున్నది.

దీపాదాస్ మున్షీతో అంతా చెప్తాం

రహస్యభేటీ ఏమీ కాదు. మంత్రులకు ఎక్కువ ఫండ్స్ వస్తున్నయ్. వారి నియోజకవర్గాలు బాగైతున్నయ్. మా నియోజకవర్గాలు కూడా బాగుపడ్తయని అనుకున్నం. ఇందుకోసమే అందరం కలిసి మాట్లాడుకుందమని కూర్చున్నం. కానీ, అది మార్నింగ్ వరకు వేరేలా వచ్చేసింది. కూర్చున్నది మాత్రం వాస్తవం. మా సీఎం మాట్లాడదాం అన్నరు. దీపాదాస్‌మున్షీ రేపు వస్తున్నరు. వారితో చర్చించిన తర్వాత ఏం జరిగిందో చెప్తం. **-ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

మెసేజ్ నాకూ వచ్చింది

స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో మా ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకుంటే తప్పేమిటి? నాకు కూడా మెసేజ్ పంపిండ్లు. నేను చూసుకోలేదు. అయినా, మా వాళ్లు ఏవైనా, బీజేపీవాళ్లతో, బీఆర్ఎస్ వాళ్లతో కలిసి మీ టింగ్ పెట్టుకున్నరా? ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మీటింగ్ పెట్టుకున్నరా? మాకో అధిష్ఠానం ఉంటది. సీఎం ఉంటరు. మాట్లాడుకుంటం. దీనికి ఏదో జరిగిందని క్రియేట్ చేయడం ఏమిటి? కొన్ని యూట్యూబ్ చానళ్లు, పత్రికలు పనిగట్టుకొని రాస్తున్నాయి. **- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

పూల రవీందర్‌కు టీటీఏ, బీటీఎఫ్ మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న పూల రవీందర్‌కు మరో రెండు సంఘాలు మద్దతు పలికాయి. రవీందర్ గెలుపునకు కృషిచేస్తామని టీటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికిషన్, శ్రీనివాస్ నాయక్, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ యాదగిరి, ఈ రవీందర్ వెల్లడించారు.

బీజేపీకి తెలంగాణపై ద్వేషం

నిధుల కేటాయింపుల్లో తీవ్ర నిర్లక్ష్యం : మంత్రి సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తేతెలంగాణ): భారతీయ జనతా పార్టీకి తెలంగాణపై తీవ్రమైన ద్వేషం ఉన్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. అందుకే బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కేంద్రం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లో నిధులు కేటాయించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ నేతలకు అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలు పంచడం తప్పా అభివృద్ధికి నిధులు తేవడం చేతగాదని దెప్పిపొడిచారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు కేటాయించేలా చూడాలని డిమాండ్ చేశారు.

పాటతో షూటింగ్ మొదలు?

ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ కలయికలో రూపొందనున్న చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల రెండోవారంలో షూటింగ్ మొదలుకానుంది. ఈ షూట్‌లో తారక్ కూడా జాయిన్ అవుతారని సమాచారం. తాజాగా వినిపిస్తున్న అప్‌డేట్ ప్రకారం ఎన్టీఆర్‌పై ఓ సాంగ్‌ను ప్రశాంత్‌నీల్ ప్లాన్ చేశారట. ఆ సాంగ్ షూట్‌తోనే షూటింగ్ స్టార్ట్ అవుతుందని తెలుస్తున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోని అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా ఈ సినిమాను నిలపాలని ప్రశాంత్‌నీల్ ప్రయత్నం చేస్తున్నారు. స్క్రిప్ట్ కోసం ఆయన ఎక్కువ సమయం తీసుకోడానికి కారణం కూడా అదే. తారక్ కెరీర్‌లోనే ఇది బెస్ట్ స్క్రిప్ట్ అని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమా గురించి ప్రశాంత్‌నీల్ మాట్లాడుతూ 'తారక్‌పై అభిమానంతో రాసుకున్న స్క్రిప్ట్ ఇది. ఆడియన్స్ ఊహించని స్థాయిలో సినిమా తీస్తా.' అని చెప్పారు. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మించనున్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

డియర్ నానీ.. వెర్రిగా పోదాం..

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'దసరా' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. నాని కెరీర్‌లో తొలి వందకోట్ల సినిమా 'దసరా'. ఇప్పుడు మళ్లీ అదే కాంబినేషన్లో నిర్మాత సుధాకర్ చెరుకూరి 'ది ప్యారడైజ్' సినిమాను నిర్మిస్తున్నారు. దాంతో.. అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రీప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ మొదలుపెట్టనున్నారు. నాని కూడా ఈ సినిమా కోసం ఇంటెన్స్‌గా జిమ్ చేస్తూ మేకోవర్ అయ్యే పనిలో ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా అనిరుథ్ ఖరారైనట్టు మేకర్స్ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. జెర్సీ, గ్యాంగ్‌లీడర్ చిత్రాల తర్వాత నాని, అనిరుథ్ కలిసి పనిచేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా నాని తన ఎక్స్‌లో 'మేం మా హ్యాట్రిక్‌పై ఉన్నాం.. ఇది ఒక అద్భుతం అవుతుంది.. ప్యారడైజ్ ఇప్పుడు నాని, అనిరుథ్, ఓదెల సినిమా.. స్వాగతం డియర్ అనిరుథ్..' అంటూ పోస్ట్ చేయగా, 'ఇది చాలా స్పెషల్ మై డియర్ నాని.. వెర్రిగా పోదాం..' అంటూ అనిరుథ్ రిప్లయ్ ఇచ్చారు. ఉద్వేగ పూరితంగా సాగే లార్జర్ దెన్ లైఫ్ స్టోరీతో శ్రీకాంత్ తెరకెక్కించనున్న ఈ సినిమాలో నాని పూర్తి మాస్ అవతారంలో కనిపిస్తారని, నాని కెరీర్‌లోనే ఇది హై బడ్జెట్ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు.

జాతరలో రెచ్చిపోవాలే..

ప్రఖ్యాత నటుడు బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'బ్రహ్మా ఆనందం'. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకుడు. స్వధర్మ్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా సినిమాలోని ఓ మాస్ సాంగ్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. 'రెచ్చిపోవాలే..' అంటూ సాగే ఈ పాటను శ్రీసాయికిరణ్ రాయగా, శాండిల్య పీసపాటి స్వరపరిచారు. సాకేత్, శాండిల్య ఆలపించారు. గ్రామ జాతరల్లోని సందడిని ఎస్టాబ్లిష్ చేస్తూ ఈ పాటను తెరకెక్కించినట్టు తెలుస్తున్నది. రాజా గౌతమ్ ఎనర్జిటిక్ స్టెప్పులు ఈ పాటలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేయనున్న ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని.

చిత్రం

అసలు మీ సమస్య ఏంటి?

టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డేకు కోపం వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌పై దృష్టి సారించిన ఈ అందాల భామ.. షాహిద్ కపూర్‌తో 'దేవా' అనే సినిమాలో నటించింది. ఇటీవలే ఆ సినిమా విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్‌లో విలేకరుల అడిగిన ప్రశ్నలు పూజాను అసహనానికి గురిచేశాయి. 'సల్మాన్, హృతిక్, రణ్‌వీర్, షాహిద్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడాన్ని మీరు అదృష్టంగా భావిస్తారా? అసలు అందుకు మీరు అర్హులేనా?' అని విలేకరులు పూజాను ప్రశ్నించగా.. 'ఎస్.. అర్హురాలినే. ఒకవేళ అదృష్టం వల్లే నాకు అవకాశాలు వచ్చాయని మీరు అనుకుంటే.. నేను ఏమాత్రం బాధ పడను. ఏదైనా అవకాశం వచ్చినప్పుడు దానికి అనుగుణంగా సన్నద్ధమై పూర్తి స్థాయిలో ఆ పాత్రకు న్యాయం చేయాలి. అదే అదృష్టంగా భావిస్తా.' అని సమాధానమిచ్చింది పూజా. మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల సినిమాలైతేనే చేస్తారా? అని మరో విలేకరి ప్రశ్నించగానే.. పూజా ఆగ్రహానికి గురైంది. 'అసలు మీ సమస్య ఏంటి?' అని ఎదురు ప్రశ్నించింది. వెంటనే పక్కనే ఉన్న షాహిద్ కపూర్ వాతావరణం వేడెక్కడాన్ని గమనించి తన జోకులతో చల్లపరిచే ప్రయత్నం చేశారు. ఏదేమైనా ఓ కథానాయికను అలాంటి ప్రశ్నలతో ఇబ్బంది పెట్టడం సబబు కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇష్టంతో కష్టపడి ఈ సినిమా చేశాం

'' ఈ సినిమా చేశాక, నెక్ట్స్ సినిమా ఈ టీమ్ లేకుండా ఎలా చేయాలి అని భయమేసింది. అంతబాగా చూసుకున్నారు నన్ను. తండేల్ రాజుగా నేను మారడంలో ఈ టీమ్ కృషి చాలా ఉంది. శ్రీకాకుళం వెళ్లి ఈ కథకు ప్రేరణనిచ్చిన వ్యక్తుల్ని కలుసుకొని, వారినుంచి ఎన్నో విషయాలు తెలుసుకొని కష్టపడి, ఇష్టంతో ఈ సినిమా చేశాం. చందుతో నా మూడో సినిమా ఇది. నేనంటే తనకు ప్రత్యేకమైన అభిమానం. అది టేకింగ్‌లో కనిపిస్తూవుంటుంది. సాయిపల్లవితో కలిసి పనిచేయడానికి ఆర్టిస్టులందరూ ఉవ్విళ్లూరతారు. అంతగొప్ప కోస్టార్ తను. అద్భుతమైన టీమ్ పనిచేసిన ఈ సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది.' అని అక్కినేని నాగచైతన్య అన్నారు. ఆయన, సాయిపల్లవి జంటగా నటించిన భావోద్వేగ ప్రేమకావ్యం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాగచైతన్య మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా మాట్లాడుతూ 'ట్రైలర్, టీజర్ ఏది చూసినా అద్భుతం అనిపిస్తున్నాయి. ముఖ్యంగా చైతూ, సాయిపల్లవి కెమిస్ట్రీ సూపర్. పాతికేళ్ల నుంచి నంబర్‌వన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఉన్నారు దేవిశ్రీ. ఇప్పటికీ ఆయనలో కసి తగ్గలేదు. అక్కినేని ఫ్యాన్స్‌కి ఫుల్‌మీల్ లాంటి సినిమా ఇది' అన్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన అనుభవమని, అరవింద్ తనను సొంత కూతురులా చూసుకున్నారని, చైతూ గొప్ప కోస్టార్ అని సాయిపల్లవి చెప్పారు. ఇంకా అల్లు అరవింద్, దిల్‌రాజు, చందూ మొండేటి, దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు బన్నీవాసు, విద్య, ఎడిటర్ నవీన్ నూలి, రైటర్ కార్తిక్, వంశీ నందిపాటి. ఎస్‌కేఎన్, నటి కల్పలత, భానుప్రసాద్, రియాచౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ఆకాశంలో ఒక తార మొదలైంది

మహానటి, సీతారామం, లక్కీభాస్కర్ చిత్రాలతో తెలుగులో హ్యాట్రిక్ హిట్స్ అందుకున్నారు మలయాళ అగ్ర నటుడు దుల్కర్ సల్మాన్. ముఖ్యంగా గత ఏడాది తెలుగులో ఆయన నటించిన 'లక్కీభాస్కర్' వందకోట్ల విజయాన్ని సాధించింది. టాలీవుడ్ ప్రేక్షకులు దుల్కర్‌ను ఎంతగా ఓన్ చేసుకున్నారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. అందుకే మరో క్రేజీ తెలుగు ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు దుల్కర్. సినిమా పేరు 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాదినేని దర్శకుడు. సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మాతలు. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం విశేషం. ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇవ్వగా, మరో అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ కెమెరా స్విచాన్ చేశారు. గుణ్ణం గంగరాజు గౌరవ దర్శకత్వం వహించారు. సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి రచన: గుణ్ణం గంగరాజు, కెమెరా: సుజిత్ సారంగ్, నిర్మాణం: లైట్ బాక్స్ మీడియా.

ఈ సారి కూడా టైటిల్ మాదే



సెలబ్రిటీ క్రికెట్ లీగ్(CCL) 11వ సీజన్ ఫిబ్రవరి 8న బెంగళూరులో ప్రారంభం కానుంది. CCL నాలుగు సీజన్లలో వరుసగా తెలుగు వారియర్స్ ఛాంపియన్స్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ లెగసీని కొనసాగించేందుకు మరోమారు తెలుగు వారియర్స్ సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో తెలుగు వారియర్స్ జెర్సీని ఆవిష్కరించారు. టీమ్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ 'సీసీఎల్ ఆడుతూ పెరిగా. ఇప్పటికి నాలుగుసార్లు టైటిల్ గెలిచాం. ఈ సారి కూడా టైటిల్ మాదే. ఎంటర్టైన్ చేయాలనే పాషన్‌తో వస్తున్నాం. ఈ నెల 14, 15 తేదీల్లో ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. వచ్చి సపోర్ట్ చేయండి' అని కోరారు. 'క్రికెట్ అనేది నా చైల్డ్‌వుడ్ డ్రీం. సీసీఎల్ ఫార్మాట్‌తో నా కల నెరవేరింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ ఇందూరికి థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ అడటం అదృష్టం. అఖిల్ అగ్రెసివ్ కెప్టెన్. తన ఎత్తుగడలు బావుంటాయి. సచిన్‌జోషి ఈ టీమ్‌కి ఓనర్‌తోపాటు ఆటగాడు కూడా. క్రేజీ టీమ్‌తో వస్తున్నాం.. కప్ కొడతాం.' అని ఎస్.ఎస్.తమన్ నమ్మకంగా చెప్పారు. అఖిల్ పాషనేట్ క్రికెటర్ అని, తమన్ టీమ్‌లో స్పిరిట్‌ని తీసుకొచ్చారని, సచిన్ జోషి చెప్పారు. ఇంకా అశ్విన్, రఘు, ఆది, సామ్రాట్, సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ ఇందూరి, రికా వ్యాలీ ఛైర్మన్ షోరబ్ అర్ఫాత్ కూడా మాట్లాడారు.

రొమాంటిక్ డ్రామా నచ్చేసింది

ఆకాష్ మురళి, డైరెక్టర్ శంకర్ కుమార్తె అదితి శంకర్ జంటగా నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ప్రేమిస్తావా'. 'పంజా'ఫేం విష్ణువర్ధన్ దర్శకుడు. డాక్టర్ ఎస్.జేవియర్ బ్రిట్టో నిర్మాత. సంక్రాంతి కానుకగా తమిళంలో 'నేసిప్పాయా' పేరుతో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్ టాక్ సొంతం చేసుకుందని మేకర్స్ చెబుతున్నారు. మైత్రీ మూవీమేకర్స్ 'ప్రేమిస్తావా' పేరుతో జనవరి 31న ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. తెలుగు ప్రేక్షకులకు సినిమా నచ్చినందుకు ఆనందంగా ఉందని హీరో ఆకాష్ మురళి చెప్పారు. రిలేషన్ షిప్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ డ్రామా ఇదని, పోర్చుగల్ లొకేషన్‌లో తీసిన సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయని, ఇందులోని క్లైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తున్నాయని దర్శకుడు తెలిపారు. ఇంకా నిర్మాత కూడా మాట్లాడారు.